నమస్తే తెలంగాణ



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

బాన్సువాడ, జూలై 14: బాన్సువాడ నియోజక వర్గంలోని 109 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం అందజేశారు. బాన్సువాడలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, నాయకులు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ రాచప్ప పటేల్, నార్ల ఉదయ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**బోనమెత్తిన పోచారం దంపతులు**

బాన్సువాడ, జూలై 14: పట్టణంలోని సంగమేశ్వర కాలనీ, తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు హాజరై బోనం ఎత్తుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, డాక్టర్ అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సు గొండ తదితరులు పాల్గొన్నారు.



బోనం ఎత్తుకున్న పోచారం దంపతులు

# కల్లు సీసాలో ఎలుక కళేబరం

లింగంపేట, జూలై 14: మండలంలోని ఐలాపూర్ గ్రామ కల్లు దుకాణంలో కల్లు సీసాలో ఎలుక కళేబరం వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ఆదివారం రాత్రి కల్లు సేవించడానికి కల్లు దుకాణంలోకి వెళ్లి కల్లు సీసా కొనుగోలు చేసిన సీసాలో ఎలుక కళేబరం కనిపించడంతో అవాక్కయాయ్యాడు. సదరు రైతు కల్లు విక్రయదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో కల్లు సీసాలో ఎలుక వచ్చిన విషయాన్ని ముస్తేదార్‌కు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన మరొక వ్యవసాయ కూలీ పోలీసులకు సమాచారం అందించాడు. లింగంపేట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి ఐలాపూర్ గ్రామానికి చేరుకొని ఎలుక కళేబరం ఉన్న కల్లు సీసాను స్వాధీనం చేసుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ముస్తేదార్ నిత్యం కల్లును ఎల్లారెడ్డి నుంచి సరఫరా చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సీసాలను శుభ్రం చేయకుండా కల్లును నింపడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం కారణంగా కల్లులో పురుగులు కూడా వస్తున్నాయన్నారు. ఈ విషయమై ఎస్సైతో మాట్లాడగా.. గ్రామస్తుల సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి చచ్చిన ఎలుక ఉన్న కల్లు సీసాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ విషయాన్ని ఎల్లారెడ్డి ఎక్సైజ్ శాఖాధికారులకు సమాచారం అందించామని తెలిపారు



కల్లు సీసాలో ఎలుక

# వర్మి కంపోస్ట్‌తో ఉపయోగాలెన్నో..

## తయారీ విధానంపై అవగాహన



వర్మి కంపోస్ట్ ఎరువు ఉపయోగాలను రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త

రుద్రూర్, జూలై 14 : వ్యవసాయం రంగంలో సాంకేతికంగా, ఎరువుల యాజమాన్య పద్ధతుల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. కానీ కొంతమంది రైతులు పాత పద్ధతులను అవలంబించడానికి ఆసక్తి చూపుతున్నారు. కేవలం వ్యర్థాలతో మాత్రమే తయారు చేసే వర్మి కంపోస్ట్, సేంద్రియ ఎరువుల వాడకంపై పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల తయారీపై కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు కూడా శిక్షణ ఇస్తున్నారు. శాస్త్రవేత్తలు తెలిపిన వివరాల ప్రకారం.. వానపాముల ద్వారా తయారయ్యే ఈ ఎరువులో ఎన్నో పోషకాలు ఉంటాయి. పశువులు, కోళ్లు, గొర్రెల ఎరువులతోపాటు వానపాముల ఎరువులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వ్యర్థాలను తిని వానపాములు విసర్జించే ఎరువులో ఆక్టీరియా మైసోజిస్ అనే బ్యాక్టీరియా బోత్ ప్రమోటర్ హార్మోన్స్ పంటకు మేలు చేస్తాయి. ఈవిధంగా తయారుచేసిన ఎరువును పొలాల్లో వాడడంతోపాటు మార్కెట్‌లో విక్రయించి లాభం పొందుతారు. ఈ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుంది. 60 రోజుల్లో తయారయ్యే ఈ ఎరువును కిలోకు రూ.తొమ్మిది చొప్పున విక్రయించుకోవచ్చు. వానపాముల ద్వారా తయారు చేసుకొనే వర్మి వాష్‌ను ద్రావణాన్ని కూడా పంటలో పిచికారీ చేసుకోవచ్చు.

**శాస్త్రవేత్తల సూచనలు..**

- సేంద్రియ ఎరువు తయారీపై శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.
- వానపాముల ఎరువును ప్రధానంగా వివిధ రకాల పంటలో సుమారుగా టన్ను నుంచి టన్నున్నర వరకు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- ఈ ఎరువు తయారీకి చుట్టు వెలుతురు వచ్చే విధంగా షెడ్డు ఏర్పాటు చేసుకొని, బెడ్లు నిర్మించుకోవాలి.
- ప్రతిరోజూ ఈ వ్యర్థాలపై నీరు చల్లుతూ ఉంటూ.. 50 శాతం తేమ ఉండే విధంగా జాగ్రత్తపడాలి.
- వానపాములతో తయారయ్యే ఈ ఎరువులో 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే వానపాములు చనిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ఎప్పటికప్పుడు నీళ్లు చల్లుకుంటూ.. పైన గోనె సంచులు వేసి తడుపుతూ ఉండాలి.
- వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ సమయంలో కప్పలు, తొండలు తిరగకుండా, బెడ్లలో గాజు పెంకులు లేకుండా చూడాలి. ప్రతి పది రోజులకోసారి ఆవు పేడ నీళ్లలో కలిసి చల్లుకుంటూ ఉండాలి.

### వర్మి కంపోస్ట్ ఎరువుపై రైతుల ఆసక్తి..



రైతులు వర్మి కంపోస్ట్ ఎరువుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎరువు తయారీ, వాడకంపై ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సూచనల మేరకు నడుచుకుంటే మంచిది. కంపోస్ట్ ఎరువు తయారీపై కేవీకేలో శిక్షణ కూడా ఇస్తున్నాం. రసాయన ఎరువుల వాడకం తగ్గించి , సేంద్రియ ఎరువులవైపు రైతులు దృష్టి సారించాలి.

**-డాక్టర్ విజయ్‌కుమార్, శాస్త్రవేత్త**



కంపోస్ట్ ఎరువు తయారీ విధానం తెలుసుకుంటున్న రైతులు

# బీసీ కుల గణన చేపట్టాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

ఖలీల్‌వాడి, జూలై 14 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీసీ కులగణన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కుక్కలు, పులులు, ఇతర జంతువులకు లెక్కలు ఉన్నాయని, బీసీ జనాభా లెక్కలు లేకపోవడం శోచనీయమని అన్నారు. ఈనెల 14న సమగ్ర కుల గణన సాధన యాత్ర కామారెడ్డి నుంచి ప్రారంభమైందని, ఈనెల 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. బీసీ కులగణన చేపట్టకపోతే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. బీసీలకు అడ్డువచ్చే వారిని గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. మొన్నటి కేంద్రం ఎన్నికల ఫలితాలు బీసీల ఐక్యతకు నిదర్శనమన్నారు. భాషాపరమైన లెక్కలు, జాతి పరమైన లెక్కలు ఉన్నప్పుడు బీసీల లెక్కలు ఎందుకు ఉండవని ప్రశ్నించారు. బీసీ కుల గణన చేపట్టకపోవడంతోనే బీజేపీ మ్యాజిక్ ఫిగర్ దాటలేదని గుర్తుచేశారు. అనంతరం మాజీ మంత్రి డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ రాష్ట్ర కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్, రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ, శ్రీనివాస్, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు శ్యాంకుమార్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, వేముల వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరిపె రవిందర్, ఆకుల ప్రసాద్, మాడవేటి వినోద్, కొయ్యాడ శంకర్, శ్రీలత, విజయ్, చంద్రమోహన్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

# ప్రభుత్వం పేరుతో వచ్చే ఈ-నోటీసులతో జాగ్రత్త

**కేంద్రం అడ్వైజరీ**

న్యూఢిల్లీ, జూలై 14: ప్రభుత్వ కార్యాలయాల నుంచి అనుమానిత రీతిలో ఈ-మెయిల్ వస్తే అందులోని అధీకృత అధికారి పేరు, విభాగాన్ని ధ్రువీకరించుకోవాలని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని భారత సైబర్ క్రైమ్ సమన్వయ కేంద్రం (ఐ4సీ) ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో ప్రజలను కోరింది. ఈ-నోటీసుల పేరిట పదే పదే వచ్చే నకిలీ-ఈ మెయిళ్లను నమ్మి సైబర్ మోసాల బాధితులుగా మారొద్దని హెచ్చరించింది. ఇలాంటి మెయిళ్లను చెక్ చేసేముందు అవి gov.inతో అంతమయ్యే అధీకృత ప్రభుత్వ వైబ్‌సైట్ నుంచి వచ్చాయా లేదో సరి చూసుకోవాలని కోరింది. అనుమానం వస్తే ఇంటర్నెట్‌లో సంబంధిత అధికారి పేరు సరైందో కాదో చెక్ చేసి సంబంధిత విభాగానికి ఫోన్ చేసి కనుక్కోవాలని సూచించింది. వివిధ ఈ-మెయిల్ అడ్రస్సులతో వచ్చే నకిలీ నోటీసులకు స్పందించొద్దని.. వాటి గురించి దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లేదా సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చని తెలిపింది. గత వారం ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సచివాలయంలోని పలువురు అధికారులకు ఈ తరహా నకిలీ ఈ-నోటీసులు వచ్చాయని చెప్పింది.




## అతి విశ్వాసమే బీజేపీని దెబ్బ తీసింది

**యూపీలో లోక్‌సభ ఫలితాలపై సీఎం యోగి ఆదిత్యనాథ్**

లక్నో, జూలై 14: అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ప్రజలు అధికార బీజేపీకి ఊహించని షాక్ ఇచ్చారు. 2019లో 62 ఎంపీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ, ఈ సారి 33 స్థానాలకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం లక్నోలో బీజేపీ యూపీ వర్కింగ్ కమిటీ సమావేశం వాడివేడిగా జరిగింది. సీఎం యోగి మాట్లాడుతూ, 'ప్రధాని మోదీ నాయకత్వంలో, యూపీలో ప్రతిపక్షంపై నిరంతరం ఒత్తిడి పెంచాం. దీంతో 2014, 2017, 2019 ఎన్నికల్లో విజయం సాధించాం. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు ప్రతిపక్షానికి బదిలీ అయ్యాయి. ఇది మన అతి విశ్వాసం వల్లే జరిగింది. మన అంచనాల్ని తలకిందులు చేసింది. ఓటమితో నీరసపడిన ప్రతిపక్షం.. ఇప్పుడు గెలుపును అందుకొని పుంజుకుంది' అని అన్నారు. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ ఘోర పరాభావాన్ని పొందింది.

## ఢిల్లీ దవాఖానలో కాల్పులు.. రోగి మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జీటీబీ హాస్పిటల్‌లో ఓ టీనేజర్ ఆదివారం జరిపిన కాల్పుల్లో ఓ రోగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రియాజుద్దీన్ (32) పొత్తి కడుపు ఇన్ఫెక్షన్‌తో గత నెల 23 నుంచి ఈ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. 24వ వార్డులో ఉన్న ఆయనపై 18 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. వ్యక్తిగత కారణాల వల్లే కాల్పులు జరిపినట్లు తెలుస్తున్నదని డిప్యూటీ పోలీస్ కమిషనర్ (సహదర) సురేంద్ర చౌదరి చెప్పారు.

## 30 ఏండ్లకు తెరుచుకున్న ఉమా భగవతి ఆలయం

శ్రీనగర్: జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న ఉమా భగవతి దేవాలయాన్ని సుమారు 30 ఏండ్ల తర్వాత తిరిగి తెరిచారు. కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ సమక్షంలో ఆదివారం ఉమా భగవతి ప్రాణప్రతిష్ఠ, పూజలు నిర్వహించారు. పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో ఈ దేవాలయంలో పూజలు చేయడానికి భక్తులకు అనుమతి ఇచ్చారు.

## ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా 'యూ-విన్'

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సాధారణ టీకాల కార్యక్రమ ట్రాకింగ్, నమోదు కోసం ఆగస్ట్ చివరి నాటికి యూ-విన్ పోర్టల్ అందుబాటులోకి రానుందని అధికార వర్గాలు తెలిపాయి. కొవిడ్ వ్యాక్సినేషన్ పోర్టల్ కో-విన్‌కు నకలుగా ఉండే ఈ పోర్టల్‌ను పశ్చిమ బెంగాల్ మినహా మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నారు. గర్భిణులు, అయిదేండ్ల లోపు పిల్లలకు వేసే ప్రతి టీకాను యూ-విన్‌లో నమోదు చేయనున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా పని చేసే ఈ పోర్టల్‌లో ఈ-టీకా ధ్రువీకరణ పత్రాన్ని ఒక్క క్లిక్ ద్వారా పౌరులెవరైనా పొందొచ్చు. రియల్ టైమ్‌లో పనిచేసే ఈ పోర్టల్ లేదా ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికేషన్‌లో కోరుకున్న టీకా కేంద్రాల్లో టీకాలు పొందడానికి పౌరులు స్వీయ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టీకా వేయించుకొనే టైమ్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు.

# కర్ణాటకలో బస్సు చార్జీల మోత!

- ఏకంగా 20 శాతం మేర పెంపు?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం
- కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్ వెల్లడి
- గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడాదిగా ప్రజలపై పన్నుల మోత
- సిద్ధరామయ్య సర్కార్‌పై జనాగ్రహం



తుమకూరు/బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనున్నది. రాష్ట్రంలో త్వరలో బస్సు చార్జీలు భారీ స్థాయిలో పెరగనున్నాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ బస్సుల్లో చార్జీల పెంపు అనేది అనివార్యమని ఆయన పేర్కొన్నారు. బస్సు చార్జీలను 15-20 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేఎస్ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపిందని వెల్లడించారు. 'రెండు రోజుల క్రితం మా బోర్డు సమావేశం జరిగింది. బస్సు చార్జీలను 15-20 పెంచాలని మేం ప్రతిపాదనలు పంపాం. మిగతాది సీఎం సిద్ధరామయ్య విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కేఎస్ఆర్టీసీ మనుగడ సాగించాలంటే, చార్జీల పెంపు తప్పనిసరి' శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇంధన, బస్సుల విడి పరికరాల ధరలు పెరిగాయని చెప్పారు. 2019 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు లేదని, అదేవిధంగా కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల సవరణ కూడా 2020 నుంచి జరుగలేదని, కాబట్టి టికెట్ ధరలను పెంచడం అవసరమని చెప్పుకొచ్చారు. గత మూడు నెలల కాలంలో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వచ్చిందని వెల్లడించారు.

**గత ఏడాదిలో పన్నుల మోత**

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. వివిధ రకాల పన్నులు, ఇతరత్రా రూపాల్లో సామాన్యుడి జేబును గుల్ల చేస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పెంచిన విషయం తెలిసిందే.

### గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీలను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

## నిన్న వాల్మీకి.. నేడు వక్ఫ్ బోర్డ్

**కర్ణాటకలో నిధుల గోల్‌మాల్**

బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి బాగోతాలు మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. వాల్మీకి కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న భారీ కుంభకోణం (రూ.187 కోట్ల వరకు నిధుల దారిమళ్లింపు) మరువకముందే, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో వక్ఫ్ బోర్డ్ సీఈవోగా పనిచేసిన జుల్ఫీకరుల్లా రూ.4 కోట్ల నిధుల్ని అక్రమంగా తరలించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులు కాజేసిన అతడిపై చర్యలు చేపట్టాలని వక్ఫ్ బోర్డ్ ప్రస్తుత సీఈవో మీర్ అహ్మద్ అబ్బాస్ బెంగళూరులోని హై గ్రౌండ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వక్ఫ్‌బోర్డ్‌కు అతడి వల్ల రూ.8.03 కోట్లు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. 'గుల్బర్గా దర్గాలో వక్ఫ్ భూముల్ని తీసుకున్నందుకు ప్రభుత్వం రూ.2.29 కోట్లు చెల్లించింది. అలాగే ఎండోమెంట్ శాఖ నుంచి రూ.1.79 కోట్లు వక్ఫ్ బోర్డ్‌కు జమయ్యాయి. మొత్తం రూ.4,00,45,465 వక్ఫ్ బోర్డ్ బ్యాంక్ ఖాతాలో జమైంది. ఈ మొత్తాన్ని 2016 నవంబర్ 26న అప్పటి సీఈవో జుల్ఫీకరుల్లా తన బ్యాంక్ ఖాతాలోకి అక్రమంగా బదిలీ చేశాడు' అని సీఈవో అబ్బాస్ చెప్పారు. అయితే నిధుల్ని కాజేసిన ఇన్నేండ్ల తర్వాత 2024 జూన్ 12న వక్ఫ్ బోర్డ్ ఫిర్యాదు చేయటం సంచలనంగా మారింది. వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో జరిగినట్టుగానే వక్ఫ్ బోర్డ్‌లో నిధులు దారిమళ్లటం రాష్ట్రంలో సంచలనం రేపింది. వాల్మీకి స్కామ్‌లో ఏకంగా రాష్ట్ర మంత్రి బీ నాగేంద్ర సహా 11 మంది అరెస్టు అయ్యారు.


## ఎక్స్‌లో 10 కోట్లకు చేరిన మోదీ ఫాలోయర్లు

న్యూఢిల్లీ: ఎక్స్ సామాజిక మాధ్యమంలో ప్రధాని మోదీ రికార్డు సృష్టించారు. ఆయనను ఫాలో అవుతున్నవారి సంఖ్య ఆదివారం 10 కోట్లను దాటింది. గడచిన మూడేళ్లలో దాదాపు 3 కోట్ల మంది ఫాలోయర్స్ పెరగడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్ వేదికపై ఎక్కువ మంది ఫాలో అయ్యే ప్రభుత్వాధినేత మోదీనే. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు 2.75 కోట్ల మంది, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు 3.81 కోట్ల మంది, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు.

## అందరికీ ఇన్సూరెన్స్!

- బీమా చట్టానికి సవరణలు
- బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం బిల్లు

న్యూఢిల్లీ: బీమా చట్టం, 1938ని సవరించడం కోసం ఓ బిల్లును రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తున్నది. 2047నాటికి అందరికీ బీమా కల్పించాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని సవరించబోతున్నట్లు తెలుస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పాలసీదారుల ప్రయోజనాలతోపాటు సులువుగా వ్యాపారం చేయడాన్ని ప్రోత్సహించే విధంగా ఈ సవరణ ఉండబోతున్నట్లు సమాచారం. కాంపోజిట్ లైసెన్స్, సాల్వెన్సీ నిబంధనల తగ్గింపు, క్యాప్టివ్ లైసెన్స్ జారీ, ఇంటర్మీడియరీలకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్, ఇతర ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ పంపిణీకి ఇన్సూరర్లకు అనుమతి ఇవ్వడం వంటి నిబంధనలు ఈ బిల్లులో ఉంటాయి. దీనివల్ల బ్యాంకింగ్ రంగంలో మాదిరిగానే బీమా రంగంలోకి కూడా ప్రత్యేకత గల బీమా కంపెనీలు వచ్చే అవకాశం ఉంటుంది. బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుత వర్గీకరణ ప్రకారం, యూనివర్సల్ బ్యాంక్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, పేమెంట్స్ బ్యాంక్ ఉన్న సంగతి తెలిసిందే. కాంపోజిట్ లైసెన్స్ ఇవ్వడం వల్ల లైఫ్ ఇన్సూరర్లు జీవిత బీమా లేదా సాధారణ బీమా పాలసీలను మూల్యాంకనం చేసి, ప్రీమియం రేట్లను నిర్ణయించడానికి వీలవుతుంది. 1938నాటి చట్టం ప్రకారం లైఫ్ ఇన్సూరర్లు కేవలం జీవిత బీమాను, జనరల్ ఇన్సూరర్లు కేవలం ఆరోగ్య, మోటార్, అగ్ని ప్రమాద, మెరైన్ వంటి నాన్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్‌లను మాత్రమే ఇవ్వడానికి వీలవుతున్నది. అంటే ఓ ఇన్సూరెన్స్ కంపెనీ జీవిత బీమా ప్రొడక్ట్‌లను, నాన్ లైఫ్ బీమా ప్రొడక్ట్‌లను ఏక మొత్తంగా ఇవ్వడానికి వీలుకాదు. ఈ పరిస్థితిని నివారించి, అందరికీ బీమాను అందజేయాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ బిల్లు తుది ముసాయిదా సిద్ధమైనట్లు తెలుస్తున్నది. దీనిని కేంద్ర క్యాబినెట్ ఆమోదం కోసం పంపిస్తారు.



## ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ము కశ్మీరులోని కేరన్ సెక్టర్‌లో ఆదివారం ముగ్గురు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టింది. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి భారత్‌లోకి చొరబడేందుకు వీరు చేసిన ప్రయత్నాలను విఫలం చేసింది. వీరి వద్ద నుంచి ఆయుధాలను, యుద్ధ సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ఉగ్రవాదుల చొరబాట్ల నిరోధక కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు వివరించింది.

## మణిపూర్‌లో మిలిటెంట్ల దాడి

**సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి**

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో భద్రతా బలగాలపై మిలిటెంట్లు జరిపిన దాడిలో ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. జిరిబామ్ జిల్లా మాంగ్‌బంగ్ గ్రామంలో ఆదివారం ఉదయం సీఆర్‌పీఎఫ్, పోలీసులు కలిసి గాలింపు చేపడుతుండగా, సాయుధులైన కొందరు దుండగులు దాడి చేశారు. కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన అజయ్ కుమార్ ఝా (43) మృతి చెందగా, ఒక పోలీస్ గాయపడ్డాడు. అతడిని వెంటనే దవాఖానకు తరలించగా, ప్రాణాపాయం తప్పింది. ఈ కాల్పుల్లో భద్రతా దళాలకు చెందిన ఒక వాహనం కూడా ధ్వంసమైంది. కుకీ జాతికి చెందిన మిలిటెంట్లు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

## క్రిప్టో కరెన్సీ పేరుతో 20 లక్షల టోకరా

**హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అరెస్టు**

న్యూఢిల్లీ, జూలై 14: క్రిప్టోకరెన్సీ పేరుతో ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు కాజేసిన హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అఖిలేశ్వర్ రెడ్డిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మరొక నిందితుడి కోసం గాలిస్తున్నట్టు ద్వారకా డీసీపీ అకింత్ సింగ్ చెప్పారు. క్రిప్టోకరెన్సీ కొనుగోలు, అమ్మకం ద్వారా భారీ మొత్తంలో ఆదాయముంటుందని, తన నుంచి రూ.20.16 లక్షలు పెట్టుబడిగా తీసుకుని మోసం చేశారని ఢిల్లీలోని ద్వారకకు చెందిన అక్షయ్‌కుమార్ సింగ్ నేషనల్ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఢిల్లీ పోలీసులు.. నిందితులు హైదరాబాద్‌కు చెందిన వారని గుర్తించారు.